క్లుప్తంగా

వీరాంజనేయస్వామికి పూజలు



పొదలకూరు: పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న శ్రీవీర అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. కాపు, బలిజ, తెలగ సేవా సంఘం ఉభయకర్తగా వ్యవహరించింది. ఉదయం దేవస్థానంలో అభిషేకాలు, ఆకుపూజ, అష్టోత్తర పూజలను నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం పల్లకి సేవ, పూజలు, గ్రామోత్సవం జరిగింది.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసులు



సత్కరిస్తున్న చేనేత ఐక్య వేదిక సభ్యులు

కొడవలూరు(బుచ్చిరెడ్డిపాళెం): బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా కాసా శ్రీనివాసులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలోని నివాసంలో ఆయన్ను చేనేత ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ బాలాజీ ఆధ్వర్యంలో మంగళవారం సత్కరించారు. పార్టీ బుచ్చిరెడ్డిపాళెం అర్బన్ ప్రధాన కార్యదర్శి సురేంద్ర, చేనేత ఐక్యవేదిక సభ్యులు గోపాల్, చంద్ర, వెంకటేశ్వర్లు, మాధవయ్య, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.


గడ్డి మందు తాగిన వ్యక్తి మృతి

విడవలూరు: గడ్డి మందు తాగి వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందారు. వివరాలు.. కంచరపాళేనికి చెందిన తిరుమల (37) పొలం పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. బ్యాంక్ ద్వారా, స్థానికంగా కొంత అప్పు చేసి ఇంటిని నిర్మించుకుంటున్నారు. వడ్డీలెక్కువ కావడంతో అవి తీర్చలేక గడ్డి మందును ఈ నెల 17వ తేదీ రాత్రి తాగారు. గమనించిన కుటుంబసభ్యులు నెల్లూరులోని ఓ ప్రైవేట్ హాస్పిటల్లో చేర్పించారు. మెరుగైన చికిత్స నిమిత్తం నెల్లూరులోని ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అక్కడ మంగళవారం మృతిచెందారు. మృతుడికి కుమార్తె ఉంది. భార్య భవాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కండలేరులో 28.342 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 28.342 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 2,200, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 100, హైలెవల్ కాలువకు 10, మొదటిబ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

బేస్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ



నెల్లూరు(టౌన్): కదిరిలో ఇటీవల నిర్వహించిన బేస్‌బాల్ రాష్ట్ర స్థాయి సీనియర్స్ మహిళా విభాగ పోటీల్లో కేపీసీ జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సర విద్యార్థి పురందేశ్వరి రజత పతకాన్ని సాధించారు. పాఠశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినిని ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి అభినందించారు. ఫిజికల్ డైరెక్టర్ పాటూరు వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- వ్యక్తికి గాయాలు

చేజర్ల(సోమశిల): చేజర్ల మండల పరిధిలోని యనమదల గ్రామ సమీపంలో ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొని ఓ వ్యక్తికి గాయాలైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని ఎర్రబల్లి గ్రామానికి చెందిన చింతా తిరుమలరావు అనే వ్యక్తి సచివాలయ పనుల నిమిత్తం యనమదలకు వెళ్తుండగా ఎదురుగా కలువాయి వైపు నుంచి వేగంగా వస్తున్న బస్సు మలుపు వద్ద బైక్‌ను ఢీకొనగా తిరుమలరావు కుడికాలు పూర్తిగా విరిగిపోయి, అక్కడక్కడా గాయాలు కాగా వెంటనే 108 ద్వారా పొదలకూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం నెల్లూరులోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించినట్లు సమాచారం.

పోలేరమ్మకు ప్రత్యేకాలంకరణ

మనుబోలు: మండలంలోని మనుబోలు కోదండరామపురంలో ఉన్న పోలేరమ్మ ఆలయంలో ఆషాఢమాసం చివరి మంగళవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు శ్రీనివాసులు అభిషేకం నిర్వహించారు. దేవి ఖడ్గ మాలార్చన, కుంకుమ పూజలు నిర్వహించి అమ్మవారికి వరాహ అలంకారం చేశారు. కార్యక్రమానికి ఉభయదాతలుగా గంధళ్ల కృష్ణయ్య, అన్నపూర్ణమ్మ వ్యవహరించారు.





శాకంబరిగా కన్యకాపరమేశ్వరి

పొదలకూరు: ఆషాఢమాసం సందర్భంగా పట్టణంలోని శ్రీకన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారు మంగళవారం భక్తులకు శాకంబరిగా దర్శనమిచ్చారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

భక్తిశ్రద్ధలతో సారె సమర్పణ

ఇందుకూరుపేట: గంగపట్నంలోని చాముండేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో సారెను భక్తిశ్రద్ధలతో మంగళవారం సమర్పించారు. రథ మండపం నుంచి ఆలయం వరకు మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కోలాటాల నడుమ సారెతో మహిళలు ఊరేగింపుగా చేరుకున్నారు. అమ్మవారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి మండపంలో కొలువుదీర్చారు. సామూహిక కుంకుమార్చన పూజలను నిర్వహించారు.



కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత



క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించిన పూజిత, నేతలు

- ప్రశ్నించే వారిపై కేసులతో వేధింపులు
- కాకాణి పూజిత ధ్వజం

మనుబోలు: ఏడాది పాలనలోనే కూటమి ప్రభుత్వంపై రాష్ట్ర ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె కాకాణి పూజిత అన్నారు. మనుబోలు మండల కేంద్రంలోని పద్మావతి కల్యాణ మండపంలో మంగళవారం ఆ పార్టీ మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో రీకాల్ చంద్రబాబూస్ మేనిఫెస్టో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సూపర్‌సిక్స్ అంటూ ఎన్నికల్లో హామీలిచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక వాటికి తిలోధకాలిచ్చాడని ధ్వజమెత్తారు. ప్రభుత్వంపై వ్యక్తమవుతున్న వ్యతిరేకత నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు మోపుతున్నారని మండిపడ్డారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా కూటమి ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. తన తండ్రి కాకాణిపై రోజుకో కొత్త కేసు మోపుతూ బెయిల్ రాకుండా వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గోవర్ధన్‌రెడ్డిని జైల్లో



అక్రమ కేసులకు నిరసనగా కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న నాయకులు

పెట్టినంత మాత్రాన ఆయన ఆశయాలు, పోరాట స్ఫూర్తిని అడ్డుకోలేరన్నారు. కూటమి పాలన తెల్లదొరల పాలనను తలపిస్తోందన్నారు. ప్రభుత్వ నియంతృత్వ పోకడలపై కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ వజ్రమ్మ, వైస్ ఎంపీపీ వెంకటరమణారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు రాజేశ్వరమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి, బొమ్మిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, ముంగర రవీందర్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, గుంజి రమేష్, ఆవుల మనోహర్‌రెడ్డి, తుపాకుల గిరి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల ఇళ్లకెళ్లి సరుకులివ్వాలి

కొడవలూరు: వృద్ధులు, దివ్యాంగుల ఇళ్ల వద్దకెళ్లి సరుకులను ఇవ్వాలని తహసీల్దార్ స్ఫూర్తిరెడ్డి ఆదేశించారు. మండలంలోని చౌక డిపోల డీలర్లతో తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వృద్ధులు, దివ్యాంగుల ఇళ్లకెళ్లి వేలి ముద్రలనే తీసుకొని, సరుకులను చౌక డిపోకు వచ్చి తీసుకోవాలని సూచిస్తున్నారనే అంశంపై ఫిర్యాదులొస్తున్నాయని చెప్పారు. ఇళ్ల వద్దే సరుకులను ఇవ్వకపోతే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. తనిఖీల సమయంలో వ్యత్యాసాలు బయటపడితే చర్యలు చేపడతామన్నారు. డీటీ సారంగపాణి, ఆర్ఐ హైమావతి,



మాట్లాడుతున్న స్ఫూర్తి రెడ్డి

సీనియర్ సహాయకుడు మస్తాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతానందన్‌కు నివాళి

తోటపల్లిగూడూరు: మండలంలోని నరుకూరు సెంటర్‌లో ఉన్న సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం కేరళ మాజీ సీఎం వీఎస్ అచ్యుతానందన్ చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆటో కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మారుబోయిన రాజా మాట్లాడుతూ సీపీఎం వ్యవస్థాపకుల్లో అచ్యుతానందన్ అనేక ప్రజా పోరాటాలకు నాయకత్వం వహించారన్నారు. ఆయన మృతి సీపీఎంకు తీరని లోటన్నారు. కార్యక్రమంలో నరుకూరు ఆటో యూనియన్ కార్యదర్శి అరణి గోపీ, ట్రెజరర్ శివ,



సహాయ కార్యదర్శి వెంకటశేషయ్య, ఆకుల రఘు, సుబ్బయ్య, శీను, బాబు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

టీబీపై ప్రత్యేక దృష్టి సారించాలి

కొడవలూరు: టీబీపై ప్రత్యేక దృష్టి సారించాలని ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ సూచించారు. మండలంలోని రామన్నపాళెంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. క్షయను పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తోందని చెప్పారు. ఇంటింటి సర్వే చేయడం ద్వారా టీబీ లక్షణాలను ప్రాథమిక దశలోనే గుర్తించి నివారించాలని తెలిపారు. అనుమానం ఉన్న వారికి గళ్ల పరీక్షను విధిగా చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని కోరారు. వైద్యాధికారి బాలచంద్రబాబు, టీబీ పర్యవేక్షణాధికారి సత్యనారాయణ, హెచ్‌ఎస్



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో ఏడీఎంహెచ్‌ఓ తదితరులు

రామ్మోహన్, హెచ్‌ఏ షఫీఉద్దీన్, ఎమ్మెల్‌హెచ్‌పీ మాబ్జానీ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్హత లేకపోయినా 'పది' పూర్తి చేసే అవకాశం

కొడవలూరు: ఎలాంటి విద్యార్హత లేకపోయినా, 14 ఏళ్లు నిండితే పదో తరగతి పూర్తి చేసే అవకాశాన్ని సార్వత్రిక విద్య ద్వారా కల్పించారని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. నార్తురాజుపాళెంలోని జెడ్పీ హైస్కూల్లో ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, వెల్ఫేర్ సహాయకులు, సీఆర్‌ఎమ్టీలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఎంఈఓ అంకయ్య మాట్లాడారు. నార్తురాజుపాళెంలోని జెడ్పీ హైస్కూల్లో పది, ఇంటర్‌కు అడ్మిషన్లను పొందొచ్చని చెప్పారు. సందేహాలుంటే సార్వత్రిక విద్య మండల సమన్వయకర్త, హెచ్‌ఎం ఓబులేసును సంప్రదించాలని సూచించారు.

చేనేత కార్మికుల అభివృద్ధే లక్ష్యం

కోవూరు: చేనేత పరిశ్రమకు నూతన శక్తిని నింపి, కార్మికులను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చేనేత శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. కోవూరు క్లస్టర్ పరిధిలోని పాటూరు, ఇనమడుగు, గుమ్మళ్లదిబ్బ గ్రామాల చేనేత కార్మికులకు అవగాహన సదస్సును పట్టణంలోని గుమ్మళ్లదిబ్బ రామాలయం వద్ద మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మొదటి విడతలో భాగంగా 86 మంది చేనేత కార్మికులకు ఆధునిక యంత్ర సామగ్రి మంజూరైందని, త్వరలో వీటిని అందజేయనున్నామని వెల్లడించారు.

ఉచిత దంత వైద్య శిబిరం

పొదలకూరు: పట్టణంలోని విజేత స్కూల్లో నెల్లూరు స్మైల్ దంత వైద్యశాల వారు ఉచిత దంత వైద్య శిబిరాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జి.భవాని, డాక్టర్ ఎస్‌కే యాసిన్ 200 మంది విద్యార్థులకు దంత పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ జి.కామాక్షి పాల్గొన్నారు.



రూ.3 కోట్లతో బాలికల వసతి గృహం



విద్యార్థులతో కలిసి ప్రార్థన చేస్తున్న డీడీ తదితరులు

- డీడీ శోభారాణి

మనుబోలు: మండలంలోని మనుబోలులో శిథిలావస్థకు చేరుకున్న బాలికల వసతి గృహానికి సంబంధించి రూ.3 కోట్లతో నూతన భవనాన్ని నిర్మిస్తామని, అనుమతులు కూడా వచ్చాయని సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణి తెలిపారు. మనుబోలులోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల, బాలుర వసతి గృహాలను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి టిఫిన్ చేసి ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లాలో దెబ్బతిన్న వసతి గృహాలకు ఇటీవల మరమ్మతులు చేయించామని తెలిపారు. ఇంకా వైట్ వాష్ మాత్రమే వేయాల్సి ఉందన్నారు. ప్రస్తుతం గృహాల్లో 60 శాతం మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారని చెప్పారు. హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి నెలా విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేయించాలని వార్డెన్లకు చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూఓ సుధామణి, మేట్రిన్లు మహేశ్వరి, అనిత పాల్గొన్నారు.

పేదలకు అండగా నిలవాలి : ఎంపీడీఓ

తోటపల్లిగూడూరు: గ్రామీణ ప్రాంతాల్లోని పేదలను దాతలు దత్తత తీసుకుని అండగా నిలవాలని ఎంపీడీఓ వెంకటేశ్వరరావు సూచించారు. మండల పరిషత్ అధ్యక్షురాలు ఉప్పల స్వర్ణలత అధ్యక్షతన మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం జరిగింది. అన్ని శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నరుకూరు ఎంపీటీసీ సభ్యుడు కొణతం రఘుబాబు నరుకూరులోని సర్వే నంబర్ - 17లోని ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని, దీనిపై చర్యలు తీసుకుని పంచాయతీ డంపింగ్ యార్డుకు కేటాయించాలన్నారు. అలాగే తల్లికి వందనం పథకం కింద అర్హులుగానే గుర్తించినా కొందరికి ఇంకా డబ్బులు పడలేదన్నారు. అందరికీ నగదు జమయ్యేలా చూడాలన్నారు. ఎంపీడీఓ వెంకటేశ్వరావు మాట్లాడుతూ పీ-4 కార్యక్రమంలో భాగంగా గుర్తించిన అనాథలకు దాతలు చేయూతనిచ్చి దత్తత తీసుకోవాలన్నారు. వర్షాకాలం ప్రారంభమ



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటేశ్వరరావు

వుతున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలను వేగవంతం చేయాలని కార్యదర్శులకు సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఎంబేటి శేషమ్మ, మండల ఉపాధ్యక్షుడు చెరుకూరు శ్రీనివాసులునాయుడు, తహసీల్దార్ పద్మావతి, అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

డెంగీ మాసోత్సవాలు



మురుగునీటిలో చేపల్ని వదులుతూ..



ముత్తుకూరులో..

పొదలకూరు: డెంగీ మాసోత్సవాల్లో భాగంగా మహ్మదాపురం పీహెచ్‌సీ పరిధిలోని చెన్నారెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం మురుగు కాలువల్లో గంబూసియా చేపల్ని వదిలిపెట్టారు. ఆరోగ్యశాఖ అధికారులు మాట్లాడుతూ ప్రతి శుక్రవారాన్ని డ్రైడేను పాటించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సహాయకులు మజహరుద్దీన్, షాజిదా, పంచాయతీ సెక్రటరీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

⇨ ముత్తుకూరు(పొదలకూరు): ముత్తుకూరులో మంగళవారం మురుగునీరు నిల్వ ప్రాంతాల్లో గంబూసియా చేపలను వదిలిపెట్టారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి దేవికృప, ఆరోగ్య శాఖాధికారులు, ఉద్యోగులు షుక్కూర్, నిర్మలమ్మ, బాలకృష్ణ, కల్యాణ్, రాజగోపాల్‌నాయుడు, నవీన్ పాల్గొన్నారు.

సేవాభావం అభినందనీయం

ఇందుకూరుపేట: సేవా కార్యక్రమాలను చేపట్టడాన్ని లలితా మహేశ్వరి ఆశ్రమ పీఠాధిపతి రామాయణం మహేష్‌స్వామి కొనియాడారు. మండలంలోని గంగపట్నంలో శ్మశాన వాటికను రూ.24 లక్షలతో స్థానికులు కొండూరు దశరథరామిరెడ్డి, గోపాల్‌రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి అభివృద్ధి చేశారు. దీన్ని మహేష్‌స్వామి మంగళవారం ప్రారంభించారు. పంబాల జనార్దన్‌రెడ్డి, వేణుంబాక మహేందర్‌రెడ్డి కొండూరు కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



యువకుడి అరెస్ట్

ఆత్మకూరు: బాలికపై లైంగికదాడి కేసులో పట్టణంలోని ఏసీఎస్సార్ కాలనీకి చెందిన ప్రణవ్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్సై జిలానీ మంగళవారం తెలిపారు. నిందితుడిని కోర్టుకు హాజరు పరచడంతో రిమాండ్ విధించారని ఆయన పేర్కొన్నారు.

సవరణకు తుది గడువు నేడు

కొడవలూరు: అన్నదాతా సుఖీభవ పథకానికి అర్హులై.. జాబితాలో పేర్లు లేని రైతులు సవరించుకునేందుకు గడువు బుధవారంతో ముగియనుందని ఏఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని గుండాలమ్మపాళెం, కొడవలూరులో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆమె మాట్లాడారు. పొలానికి ఆధార్ అనుసంధానం కాని రైతుల పేర్లను అనర్హులుగా చూపారని, ఇలాంటి వారు వీఏఏను సంప్రదించి సవరించుకోవాలని కోరారు. పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించుకునేందుకు వీలుండటంతో పాటు నష్ట పరిహారాన్ని పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఏఈఓ వెంకట్రావు, వీఏఏలు పూజిత, తమీమ్, నేతలు కోవూరు వెంకీ, జిలానీబాషా, బాబు, నక్కా రమణయ్య, శ్రీనివాసులు, అంబటి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

⇨ కోవూరు: మండలంలోని ఇనమడుగు, చెర్లోపాళెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ సహాయ సంచాలకులు అనిత మాట్లాడారు. వరిలో యూరియా వినియోగాన్ని నియంత్రించాలని సూచించారు. ఎకరాలో గరిష్ఠంగా రెండు బస్తాల యూరియానే వాడాలని కోరారు.



కొడవలూరు: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అధికారులు తదితరులు

⇨ ఇందుకూరుపేట: పచ్చిరొట్ట విత్తనాలను 50 శాతం సబ్సిడీపై ప్రభుత్వం అందజేస్తోందని మండల వ్యవసాయాధికారి రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఇందుకూరుపేటలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ - క్రాప్‌ను నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు. అనంతరం వరిలో యాజమాన్య పద్ధతులను తెలియజేశారు.

⇨ మనుబోలు: మండలంలోని కాగితాలపూరు, పిడూరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య మాట్లాడుతూ రైతులు తమ పొలాల్లో జీలుగ, పిల్లిపెసర లాంటి పచ్చిరొట్ట పంటలు సాగు చేయడం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవచ్చన్నారు. రసాయన ఎరువుల వాడకంలో నియంత్రణ పాటించాలన్నారు. వాటి స్థానంలో సేంద్రియ ఎరువులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.



కోవూరులో..



ఇందుకూరుపేటలో..



మనుబోలు : అవగాహన కల్పిస్తున్న ఏఓ

క్లుప్తంగా

హెచ్ఐవీపై అవగాహన సదస్సు



విడవలూరు: మండలంలోని రామతీర్థం గామ సచివాలయంలో ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవీపై అవగాహన సదస్సు సోమవారం జరిగింది. ఈ సందర్భంగా సంస్థ మెంబర్ సుప్రజ మాట్లాడుతూ హెచ్ఐవీ బాధితులపై వివక్ష చూపకూడదని, వారికి తగిన గౌరవం ఇవ్వాలన్నారు. అదేవిధంగా హెచ్ఐవీ సోకడానికి గల కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

స్కూల్ సందర్శన

పొదలకూరు: మార్గదర్శి – బంగారు కుటుంబం పథకాన్ని విజయవంతం చేయాలని ఎంఈఓ – 1 కె.రేణుక పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాన్ని వివరించేందుకు సోమవారం పట్టణంలోని నాగార్జున స్కూల్‌ను ఎంఈఓ సందర్శించారు. ఈ సందర్భంగా పథకంపై అవగాహన కల్పించారు.

ఎమ్మెల్యే పర్యటన

కోవూరు: మండలంలోని పడుగుపాడులో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సోమవారం పర్యటించారు. అనంతరం పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

తోటపల్లిగూడూరు: మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే వరిసాగులో అధిక దిగుబడులను సాధించవచ్చని మండల వ్యవసాయాధికారిణి శిరీషారాణి అన్నారు. మండలంలోని పాపిరెడ్డిపాళెం గ్రామంలో సోమవారం పొలం బడి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తన ఎంపిక నుంచి పంట దిగుబడి వరకు తగిన అవగాహనతో రైతులు సాగు చేపట్టాలన్నారు. అధిక యూరియా వాడటం వల్ల తాలు గింజలు ఏర్పడటంతోపాటు దోమపోటుకు గురయ్యే అవకాశం ఉందన్నారు. రసాయనిక ఎరువులకు బదులు పచ్చిరొట్ట ఎరువులను వాడాలని సూచించారు. వ్యవసాయ శాఖ ద్వారా 50 శాతం సబ్సిడీపై అందిస్తున్న పచ్చిరొట్ట ఎరువులను రైతుల సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఏజెంట్ల నియామకానికి ఇంటర్వ్యూలు

నెల్లూరు రూరల్: తపాలా శాఖలో జీవిత బీమా పాలసీల సేకరణకు నూతన ఏజెంట్ల నియామకం కోసం ఈనెల 23 నుంచి 31 వ తేదీ వరకు ఇంటర్వ్యూలు ఉంటాయని నెల్లూరు పోస్టల్ డివిజనల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ సోమవారం తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై 18–65 ఏళ్ల వారు దరఖాస్తుతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లతో నెల్లూరు పోస్టల్ డివిజనల్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు 0861–2331748 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

బీజేపీ జిల్లా కార్యవర్గ ఎన్నిక

నెల్లూరు రూరల్: బీజేపీ జిల్లా నూతన కార్యవర్గాన్ని నగరంలోని ఆ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఎస్.వంశీధర్‌రెడ్డి సోమవారం ప్రకటించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా రాజేష్, పొన్నూరు మాధవి, బత్తల కృష్ణయ్య, శ్రీనివాసులు, చీదర్ల శివపార్వతి, ప్రధాన కార్యదర్శులుగా యశ్వంత్‌సింగ్, బెల్లంకొండ మాల్యాద్రి, యాకసిరి ఫణిరాజు, కార్యదర్శులుగా కర్తంపాటి సుధాకర్, మారెళ్ల బ్రహ్మారెడ్డి, ముక్కు రాధాకృష్ణ, సుజన, వడ్డే శ్రీనాథ్, అల్లూరు నాగవేణి, మేడపల్లి రత్నంనాయుడు, కోశాధికారిగా సీవీ రత్నం, సోషల్ మీడియా కన్వీనర్‌గా సన్నారెడ్డి సాయికుమార్, ఐటీ సెల్ కన్వీనర్‌గా బుజ్జి రామకృష్ణలను ఎంపిక చేశారు.

విద్యార్థినులకు అవగాహన

నెల్లూరు (టౌన్): మాదక ద్రవ్యాలు, బాలికల అక్రమ రవాణాపై స్థానిక డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో జిల్లా యువజన సంక్షేమ శాఖ, సెట్నల్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ కృష్ణారెడ్డి పాల్గొని, మాట్లాడారు. బాలికలపై జరుగుతున్న అకృత్యాలు, అక్రమ జరుగుతున్న విధానాలు, వాటి బారిన పడకుండా రక్షించుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీహరి, సెట్నల్ సీఈఓ నాగేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపల్ రమణారెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దర్గా ఆస్తులు హాంఫట్

- పట్టించుకోని ప్రభుత్వం, వక్ఫ్ బోర్డు
- అభివృద్ధికి దూరమైన చారిత్రక సాతో షహీద్ దర్గా



గండవరంలోని సాతో షహీద్ దర్గా

కొడవలూరు: మండలంలోని గండవరంలో ఉన్న సాతో షహీద్ దర్గాకు ఎంతో చరిత్ర ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకుని దాతలు 26 ఎకరాల మాగాణి భూములను విరాళమిచ్చారు. ఇందులో 23.50 ఎకరాలు అన్యాక్రాంతం కాగా దర్గా నిర్మాణం జరిగిన చోట 2.50 ఎకరాల భూమి మాత్రమే మిగిలి ఉంది. దాతలిచ్చిన భూములు యథావిధిగా ఉంటే గంధ మహోత్సవం, రొట్టెల పండగలు ఎంతో వేడుకగా జరిగేవి. సింహభాగం భూములు అన్యాక్రాంతం కావడంతో దర్గా అభివృద్ధికి నోచుకోవడం లేదు.

చారిత్రక దర్గా

నెల్లూరు స్వర్ణాల చెరువు వద్దున్న బారా షహీద్ దర్గాతో ఇక్కడి సాతో షహీద్ దర్గాకు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. సుమారు 418 ఏళ్ల క్రితం 12 మంది ముస్లిం మత ప్రవక్తలు గుర్రాలపై ప్రయాణిస్తూ మత ప్రచారం చేసుకొంటూ గండవరం మీదుగా వచ్చారని ముస్లిం మత పెద్దలు చెబుతున్నారు. వీరికి వ్యతిరేకులైన వారితో ఇక్కడ పవిత్ర యుద్ధం జరిగిందని, అందులో ఏడుగురి మతప్రవక్తల తలలు ఇక్కడ పడగా, 12 మంది మత ప్రవక్తల మొండెములు నెల్లూరు స్వర్ణాల చెరువు వద్ద పడ్డాయన్న నానుడి ఉంది.

26 ఎకరాల మాగాణి భూమి విరాళం

ఇక్కడి సమాధులకున్న చరిత్రను గుర్తించిన కొందరు దాతలు దర్గా నిర్మాణం చేసి ఏటా పండగలు నిర్వహించాలని, ముజావర్ల జీవనోపాధికి 26 ఎకరాల మాగాణి భూములను విరాళమిచ్చారు. తొలుత ఆరంభ శూరత్వం కనబరచి దర్గా నిర్మాణం చేపట్టి గంధమహోత్సవం, రొట్టెల పండగలు నిర్వహించారు. కాలక్రమేణ దర్గా నిర్మాణం జరిగిన చోటున్న రెండున్నర ఎకరాల భూమి మినహా మిగిలిన 23.50 ఎకరాల భూమి గురించి పట్టించుకోలేదు. దీనివల్ల ఈ భూమి అన్యాక్రాంతమైందని కొందరు చెబుతుండగా, ముజావర్లుగా ఉన్నవారే వారి ఆర్థిక అవసరాల నిమిత్తం విక్రయించేశారన్న ప్రచారం కూడా ఉంది.

భూములెక్కడో?

దాతలిచ్చిన భూములు ఎక్కడున్నాయో కూడా ఇప్పటి దర్గా కమిటీ సభ్యులకు తెలియడం లేదు. భూములిచ్చారన్న విషయాన్ని స్పష్టంగా చెబుతున్నారే తప్ప ఆ భూములెక్కడన్న విషయం ఎవరికీ తెలియడం లేదు. అప్పట్లో ముజావర్లుగా ఉన్న వారు, వారి కుటుంబీకులు కూడా ఇప్పుడు లేకుండాపోయారు. పాతకాలపు రెవెన్యూ రికార్డుల్లో మాత్రమే వీటిని గుర్తించవచ్చని, రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టిసారించి పరిశీలిస్తే వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని కమిటీ సభ్యులు చెబుతున్నారు.



దర్గాకు మిగిలి ఉన్న రెండున్నర ఎకరాల భూమి

అభివృద్ధికి కృషి



సాతో షహీద్ దర్గాను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో దాతల సహకారంతో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నాం. గతంలో కేంద్రంలో మంత్రిగా ఉన్న జాఫర్ షరీఫ్ రూ.7.60 లక్షల నిధులు మంజూరు చేశారు. దీనిద్వారా దర్గాను కొంత అభివృద్ధి చేయడంతో పాటు రొట్టెలు వదిలే కోనేరు, అతిథులకు రెండు గదులు, రెండు మరుగుదొడ్లు నిర్మించాం. మరింత మంది దాతల సహకారం తీసుకుని దర్గాలో పూర్తిస్థాయి వసతుల కల్పనకు కృషి చేస్తున్నాం.

– షేక్.అబ్దుల్ రషీద్, సాతో షహీద్ దర్గా చైర్మన్, గండవరం

ప్రభుత్వం పట్టించుకుంటేనే..



ప్రభుత్వం పట్టించుకుని అభివృద్ధి చేస్తే గండవరంలోని సాతో షహీద్ దర్గా ఎంతగానో ప్రసిద్ధి చెందుతుంది. కానీ ప్రభుత్వం దీని గురించి పట్టించుకోవడం లేదు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, జిల్లా మంత్రిని కలిసి ఇక్కడి దర్గా చారిత్రక విషయాలు వివరించి అభివృద్ధి చేయాలని కోరేందుకు యత్నిస్తున్నాం.

– షేక్.యస్థాని బాషా, కోశాధికారి, సాతో షహీద్ దర్గా, గండవరం

కామాక్షితాయికి సారె సమర్పణ



కొడవలూరు(బుచ్చిరెడ్డిపాళెం): బుచ్చి మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన జొన్నవాడ కామాక్షితాయి అమ్మవారికి చీరాలకు చెందిన భ్రమరాంబిక సేవా సమితి, నెల్లూరు సేవా బృందం సంయుక్తంగా ఆషాఢమాస సారెను సోమవారం సమర్పించింది. అధిక సంఖ్యలో మహిళలు కోలాటాలు, మేళతాళాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సారె అందించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో మల్లికార్జునస్వామి కామాక్షితాయిలకు ప్రత్యేక పూలాలంకరణ గావించారు. కార్యక్రమంలో చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, టంగుటూరు, సూళ్లూరుపేట తదితర ప్రాంతాల నుంచి సుమారు 500 మంది సేవా బృంద సభ్యులు పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ.వెంకట శ్రీనివాసులురెడ్డి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళన



నిరసన తెలుపుతున్న కార్యకర్తలు

కోవూరు: కోవూరు ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణలో అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పోషణ ట్రాకర్ యాప్, బాల సంజీవని యాప్‌ల వల్ల లబ్ధిదారులు అంగన్‌వాడీ సెంటర్లకు దూరం అవుతున్నారన్నారు. సరుకులు ఇవ్వడానికి ఈకేవైసీ, ఓటీపీ, ఫొటో క్యాప్చర్ లాంటి నియమాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో వలే లబ్ధిదారుల సంతకాలు తీసుకుని సరుకులు ఇవ్వాలని, ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. 2021లో ఇచ్చిన ఫోన్లలో సర్వర్లు పనిచేయకపోవడం వల్ల లబ్ధిదారులు, అంగన్వాడీ వర్కర్లు మానసిక వేదనకు గురవుతున్నారన్నారు.

అభివృద్ధి, సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు రూరల్: అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలులో ప్రత్యేక శ్రద్ధ అవసరమని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. కలెక్టరేట్‌లోని ఎస్సార్ శంకరన్ హాల్లో పీజీఆర్ఎస్ అర్జీలు, ఇళ్ల నిర్మాణాల పురోగతి, ఉపాధి హామీ పనులు, పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు తదితర అంశాలపై సబ్ కలెక్టర్, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో సోమవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాలను చేరుకోవడంలో అశ్రద్ధగా ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పీజీఆర్ఎస్ అర్జీలను గడువులోగా పరిష్కరించాలని సూచించారు. జిల్లాలో గృహ నిర్మాణాలు, ఉపాధి హామీ పనుల పురోగతి మెరుగుపడాల్సి ఉందన్నారు. ఉపాధి హామీ పనిదినాలను పెంచి కూలీలకు పనులు కల్పించాలన్నారు. బడి ఈడు పిల్లలు పాఠశాలల్లో చేరేలా చర్యలు చేపట్టాలన్నారు. డీఆర్వో హుస్సేన్ సాహెబ్, హౌసింగ్, డ్వామా పీడీలు వేణుగోపాల్, గంగాభవాని, విద్యుత్ ఎస్ఈ విజయన్, డీఈఓ బాలాజీరావు, డీపీఓ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెల్టు దుకాణాలపై చర్యలు చేపట్టాలి

- కలెక్టర్‌కు అనికేపల్లి గ్రామస్తుల వినతి

వెంకటాచలం: తమ గ్రామంలో బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్నారని, వాటిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని అనికేపల్లి గ్రామస్తులు పలువురు కలెక్టర్ ఆనంద్‌కు వినతి పత్రం అందజేశారు. సోమవారం వారు నెల్లూరు కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన్ను కలిసి సమస్యను వెల్లడించారు. గ్రామంలోని మూడు బెల్టు షాపులతో చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. పలుమార్లు ఎక్సైజ్ శాఖ అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. బెల్టు దుకాణాలతో నిత్యం గొడవలు జరుగుతున్నాయని, వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇనుకుర్తి రేషన్ డీలర్ రాజీనామా

పొదలకూరు: మండలంలోని ఇనుకుర్తి రేషన్ షాపు డీలర్ సుబ్బారెడ్డి సోమవారం వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేశారు. దానిని తహసీల్దార్ బి.శివకృష్ణయ్యకు అందజేశారు. సమీపంలోని మరో డీలర్‌కు ఇనుకుర్తి రేషన్ పంపిణీ బాధ్యతలను అప్పగిస్తామని శివకృష్ణయ్య వెల్లడించారు.

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నేడు

తోటపల్లిగూడూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం జరుగనుందని ఎంపీడీఓ వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

పీ-4పై గ్రామసభ

మనుబోలు: మనుబోలు పంచాయతీ కార్యాలయంలో సోమవారం పీ-4పై సర్పంచ్ కంచి పద్మమ్మ అధ్యక్షతన గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి గరుడయ్య మాట్లాడుతూ వీరంపల్లి గ్రామంలో ఓ పేద కుటుంబాన్ని ఎమ్మెల్యే సోమిరెడ్డి దత్తత తీసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు దువ్వూరు రాజేశ్వరమ్మ, నాయకులు పాల్గొన్నారు.

నల్లదుస్తులు ధరించి నిరసన



ఇంద్రసేన్‌గౌడ్

పొదలకూరు: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై అక్రమంగా కేసులు పెట్టి జైల్లో పెట్టిన నేపథ్యంలో కొందరు అభిమానులు నల్లదుస్తులు ధరించి నిరసన తెలుపుతున్నారు. వైఎస్సార్‌సీపీ సర్వేపల్లి నియోజకవర్గ ఐటీ వింగ్ అధ్యక్షుడు రావుల ఇంద్రసేన్‌గౌడ్ కాకాణి జిల్లా జైలుకు వెళ్లిన నాటి నుంచి నల్లదుస్తులు ధరించి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అక్రమ కేసులు వీగిపోయి త్వరలో కాకాణి కడిగిన ముత్యంలా బయటకు వస్తారని చెప్పారు.

కూటమి వైఫల్యాలను ఎండగట్టాలి



క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించిన పూజిత, వైఎస్సార్‌సీపీ నాయకులు

- కాకాణి పూజిత

పొదలకూరు: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, సంక్షేమ పథకాల అమలులో వైఫల్యాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎండగట్టాలని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె కాకాణి పూజిత పేర్కొన్నారు. పొదలకూరులోని కల్యాణ మండపంలో సోమవారం రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టోపై మండల నాయకులు, కార్యకర్తలతో పూజిత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తూ ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. తన తండ్రి కాకాణి అక్రమ కేసులను ఎదుర్కొంటూ జిల్లా జైల్లో ఉన్నారని, ఆయన వచ్చి కార్యక్రమాలు నిర్వహిస్తారని ఎదురు చూశామన్నారు. అయితే కేసుల మీద కేసులు బనాయిస్తూ పీటీ వారెంట్లతో కాలయాపన చేస్తున్నట్లు తెలిపారు. తప్పని పరిస్థితుల్లో తాను కార్యక్రమాలను చేస్తున్నానని చెప్పారు. అయితే సర్వేపల్లి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తనను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటున్నట్టు పేర్కొన్నారు. కార్యకర్తలే తనను ముందుండి నడిపిస్తున్నారని ఎన్ని జన్మలెత్తినా మీ రుణం తీర్చుకోలేనన్నారు. చంద్రబాబు వందల సంఖ్యలో హామీలిచ్చారని ఆయన సహజ ధోరణిలోనే అమలు చేయడం లేదన్నారు. తల్లికి వందనం పథకం నగదు అరకొరగా బ్యాంక్ ఖాతాల్లో వేసి, పూర్తి చేశామని ప్రచారం చేసుకుంటున్నట్టు విమర్శించారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయకుండా కాలం వెళ్లదీస్తున్నారన్నారు. రైతుభరోసా పథకాన్ని నాడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సర్వేపల్లిలో ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వని హామీలను కూడా నెరవేర్చినట్లు వెల్లడించారు. ఇంకా పార్టీ మండలాధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి, వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ, మాజీ సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కోనం చినబ్రహ్మయ్య, ఐటీ వింగ్ అధ్యక్షుడు రావుల ఇంద్రసేన్‌గౌడ్, సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు జి.లక్ష్మీకల్యాణి, నాయకులు ఎస్కే అంజాద్, జి.వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

సీపీఐ మహాసభ



సభలో పాల్గొన్న నేతలు తదితరులు

ముత్తుకూరు(పొదలకూరు): సీపీఐ సర్వేపల్లి నియోజకవర్గ మహాసభను ముత్తుకూరులో సోమవారం నిర్వహించారు. తొలుత పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య మాట్లాడుతూ 1925 డిసెంబర్‌లో పార్టీ ఆవిర్భావం జరిగిందన్నారు. అనేక చట్టాలను తీసుకురావడంతో తమ పార్టీ కీలకభూమిక పోషించినట్టు గుర్తుచేశారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ స్వాతంత్ర్య ఉద్యమాలను నడిపిన దాఖలాల్లేవన్నారు. బ్రిటిష్ పాలనకు అనుకూలంగా ఆ పార్టీలు వ్యవహరించినట్టు విమర్శించారు. వామపక్షాల పోరాట ఫలితంగా ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో బ్యాంకుల జాతీయం జరిగినట్టు పేర్కొన్నారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం తమ పోరాట ఫలితంగానే వచ్చిందన్నారు. సభలో పార్టీ జిల్లా జాయింట్ సెక్రటరీ మాలకొండయ్య, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్‌కిశోర్ పాల్గొన్నారు. నియోజకవర్గ కార్యదర్శిగా తుంగా ఏడుకొండలును ఎన్నుకున్నారు.

తహసీల్దార్‌కు రైతుల వినతులు



వివరాలు తెలుసుకుంటున్న తహసీల్దార్

పొదలకూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ బి.శివకృష్ణయ్య పలు గ్రామాల రైతుల నుంచి పాసు పుస్తకాలు, భూ వివాదాలు తదితర సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం ఐదు వినతులు అందాయని వాటిలో మూడింటిని అక్కడికక్కడే పరిష్కరించడం జరిగిందన్నారు. మిగిలిన వాటిని వీఆర్వోలను అప్పగించి చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు.

భర్త డెత్ సర్టిఫికెట్ ఇప్పించండి



మాట్లాడుతున్న ఇండ్ల లక్ష్మమ్మ

నెల్లూరు రూరల్: గ్రామ సచివాలయం చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా చనిపోయిన నా భర్త డెత్ సర్టిఫికెట్ ఇవ్వడం లేదని బుచ్చిరెడ్డిపాళెం మండలం పెనుబల్లి గ్రామానికి చెందిన ఇండ్ల లక్ష్మమ్మ సోమవారం కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన భర్త ఏడుకొండలు మూడునెలల క్రితం రేబాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయారన్నారు. అందుకు సంబంధించిన అన్ని ధ్రువీకరణ పత్రాలను సమర్పించినా సచివాలయంలోని హెల్త్ అసిస్టెంట్ తనను రోజుల తరబడి తిప్పించుకుంటున్నారన్నారు. నువ్వు ఆయన భార్యవే అనే నమ్మకం ఏంటి, పెళ్లి కార్డు తీసుకుని రండి, మీ ఊరిలో అందరి చేత చెప్పించాలి అని చులకనగా మాట్లాడి, పురుష పదజాలంతో దూషిస్తున్నట్లు వాపోయారు. అతడిపై జిల్లా అధికారులు చర్యలు తీసుకుని, నా భర్త డెత్ సర్టిఫికెట్ ఇప్పిస్తే వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంటానని తెలిపారు.

మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా వస్తారు



అనిల్‌తో భేటీ అయిన ప్రసన్నకుమార్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఎంపీ మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా బయటకు వస్తారని మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. నగరంలోని ఇస్కాన్ సిటీలో ఉన్న మాజీ మంత్రి అనిల్‌కుమార్ నివాసానికి సోమవారం ప్రసన్న వెళ్లారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో కక్షపూరిత రాజకీయాలు తారస్థాయికి చేరుకున్నాయన్నారు. కక్ష సాధింపులో భాగంగా లేని లిక్కర్ స్కామ్‌ను సృష్టించి అక్రమంగా మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేశారన్నారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని వివరించారు.

స్మార్ట్ మీటర్లపై పోరుబాట



నెల్లూరు(వీఆర్సీసెంటర్): స్మార్ట్‌మీటర్లపై సీపీఎం ఆధ్వర్యంలో పోరుబాటను నగరంలోని 53, 54 డివిజన్లలో సోమవారం నిర్వహించారు. వెంకటేశ్వరపురం, జనార్దనరెడ్డికాలనీ ప్రాంతాల్లో సంతకాల సేకరణ చేపట్టి, స్మార్ట్ మీటర్లతో కలిగే నష్టాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యవర్గ సభ్యుడు మూలం ప్రసాద్ మాట్లాడుతూ, గతంలో నారా లోకేశ్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించారని, అధికారంలోకి వచ్చిన వెంటనే స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయడం సిగ్గుచేటన్నారు. పార్టీ నాయకులు గడ్డం శ్రీనివాసులురెడ్డి, భయ్యన్న, వెంకటేశ్వర్లు, జాఫర్, కృష్ణ, బాబు పాల్గొన్నారు.